క్లుప్తంగా

వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

లక్సెట్టిపేట: మండలంలోని శాంతాపూర్‌లో తెలంగాణ సాంస్కృతిక కళాజాత బృందం ఆధ్వర్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలు పాడుతూ శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. బృందం సభ్యులు సురేందర్, నాగలక్ష్మి, శిరీష, కృష్ణయ్య, రవీందర్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, సంతోష్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్లపై ఫిర్యాదు



ఫిర్యాదు కాపీ చూపుతున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని పలు ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల వార్డెన్లపై శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో హైదరాబాద్ సంక్షేమ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. సమయపాలన పాటించడంలేదని, మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, కాస్మోటిక్ బిల్లులు సొంతానికి వాడుకుంటున్నారని, విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్, జిల్లా బాధ్యుడు కార్తిక్ పాల్గొన్నారు.

తెగుళ్లను నివారించాలి



చింతగూడలో పంటను పరిశీలిస్తున్న సహజ

జన్నారం: కూరగాయలు, వాణిజ్య పంటలను చీడపీడలు ఆశించే అవకాశమున్నందున రైతులు నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖ అధికారి సహజ సూచించారు. శుక్రవారం మండలంలోని చింతగూడ, కిష్టాపూర్ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పసుపు, మిర్చి, బీర, కాకర తోటలను సందర్శించారు. రైతులకు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఉద్యానవనశాఖ విస్తరణ అధికారి శేఖర్, సాయి వంశీ పాల్గొన్నారు.

జనావాసాల్లోకి కొండచిలువ



రోడ్డు దాటుతున్న కొండచిలువ

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీ (షిర్కే)లోగల క్వార్టర్ల సమీపానికి శుక్రవారం వచ్చిన కొండచిలువ రోడ్డు అవతలికి దాటింది. దానిని చూసిన కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు.

లాజిస్టిక్స్ వస్తువుల వేలం

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ మంచిర్యాల లాజిస్టిక్స్ (కార్గో) కేంద్రంలో కొద్దిరోజులుగా వినియోగదారులు తీసుకువెళ్లని పెండింగ్ పార్శిళ్లను ఈనెల 15న వేలం వేయనున్నట్లు డీఎం శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 11గంటలకు వేలంలో పాల్గొనాలని సూచించారు.

బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం



యాదవ్‌రావును సన్మానిస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ చాహకటి యాదవ్‌రావును శుక్రవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివాసీ ముద్దుబిడ్డ అయిన యాదవ్‌రావు ఆదివాసీ ప్రాంతానికి మేనేజర్‌గా రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కొమ్ముల బాపు, కుర్సింగ మహేశ్వర్, మడావి రామారావు, వెడ్మ బాపురావు, కుర్సింగ హన్మంతు, కుర్సింగ తిరుపతి, పెద్దల వెంకటేశ్, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవానికి సహకరించాలి

శ్రీరాంపూర్: దసరా సందర్భంగా నస్పూర్‌లో నిర్వహించనున్న రామ్‌లీలా ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని హిందూ ఉత్సవ సమితి నేతలు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్ శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమితి ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రవీందర్, పట్టణాధ్యక్షుడు ఎర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శి సదరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూరియా రాదాయే..

- పంపిణీ కేంద్రాల వద్ద రైతుల నిరీక్షణ
- సరిపడా వస్తలేదంటున్న అధికారులు
- వివిధ పంటల్లో ఎదుగుదల లోపం
- దిగుబడిపైనే అన్నదాతల ఆందోళన



జెండావెంకటాపూర్ పీఏసీఎస్‌కు యూరియా కోసం వచ్చిన రైతులు (ఫైల్)

లక్సెట్టిపేట: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసే రైతుకు అష్టకష్టాలు తప్పడం లేదు. మొన్నటి దాకా దుక్కి దున్ని.. నారు పోసి.. నాట్లు పెట్టి.. ప్రస్తుతం యూరియా కోసం అవస్థలు పడుతున్నారు. నిత్యం ఉదయం 10గంటలకు వ్యవసాయ పనులు వదిలి పట్టణానికి వచ్చి సాయంత్రం వరకు పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ పనులకు కూలీలను పెట్టుకుని యూరియా కోసం వచ్చి ఖర్చుల పాలవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చెప్పులరిగేలా తిరిగినా బస్తా యూరియా దొరకని దుస్థితి ఉంది. నాటు వేసి నెల గడిచినా వరితోపాటు పత్తికి యూరియా అందక పంటల్లో ఎదుగుదల నిలిచిపోతోంది. దీంతో రైతులు దిగుబడిపై ఇప్పటి నుంచే దిగులు చెందుతున్నారు. మండలానికి సరిపడా యూరియా స్టాక్ రాకపోవడంతో కేంద్రాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. వచ్చిన కొద్దిపాటి యూరియాను అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య పంపిణీ చేయాల్సిన దుస్థితి నెలకొంది.

మండలంలో సాగు ఇలా..

ఖరీఫ్‌లో రైతులు మండలంలో 16,055 ఎకరాల్లో వరి, 5,608 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఇందుకు మండలానికి 2వేల టన్నుల యూరియా అవసరమవుతుంది. మండలంలో ఐదు పీఏసీఎస్‌లు, 32 ఎరువుల దుకాణాలున్నాయి. ఇప్పటివరకు ఇటిక్యాల కేంద్రం ద్వారా 150 టన్నులు, గుల్లకోట ద్వారా 150 టన్నులు, జెండావెంకటాపూర్ ద్వారా 250 టన్నులు, చందారం ద్వారా 40 టన్నులు, దొడపల్లి ద్వారా 40 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున మాత్రమే అందజేశారు. సహకార సంఘాల ద్వారా ఇప్పటివరకు 630 టన్నులు, ప్రైవేట్ దుకాణాల ద్వారా 650 టన్నుల యూరియా వచ్చింది. ఇంకా సుమారు 700 టన్నులు అవసరమున్నట్లు అధికారులు చెబుతున్నారు. త్వరగా సరిపడా నిల్వలు తెప్పించి రైతులకు పంపిణీ చేస్తే పంటలు కాపాడుకునే అవకాశముంది. వరి కోత దశకు వచ్చేసరికి మూడుసార్లు యూరియా వేయాల్సి ఉంటుంది. సకాలంలో వేయకుంటే పంట ఎదుగుదల లోపించి దిగుబడి తగ్గే ప్రమాదముందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి మండలానికి సరిపడా యూరియా తెప్పించాలని కోరుతున్నారు.

వారం నుంచి తిరుగుతున్న



మూడెకరాల్లో వరి సాగు చేసిన. ఇంకా యూరియా వేయలేదు. వారంరోజుల నుంచి తిరుగుతున్నా ఒక్క బస్తా దొరకలేదు. అధికారులు అడిగిన కాగితాలు ఇచ్చినా తిప్పించుకుంటున్నారు. సకాలంలో యూరియా అందించి ఆదుకోవాలి.

– గెల్లు బాపు, తిమ్మాపూర్ రైతు

స్టాక్ రాగానే పంపిణీ చేస్తాం



సహకార సంఘాలకు యూరియా స్టాక్ తక్కువగా వస్తోంది. మండలానికి రెండువేల టన్నుల యూరియా అవసరముంది. ఇంకా 700 టన్నులు రావాల్సి ఉంది. పైనుంచి సరిపడా స్టాక్ రాగానే మండల రైతులందరికీ యూరియా పంపిణీ చేస్తాం.

– శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి

నేడు విద్యుత్ అంతరాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర 33 కేవీ లైన్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున శనివారం ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కొమ్మెర ఫీడర్ పరిధిలోని ఆస్నాద, పొక్కూరు, దుగ్నెపల్లి పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

భీమారం: స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నందున శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దీని పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శంకర్ తెలిపారు. సహకరించాలని కోరారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని హాజీపూర్, టీకానపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, కొండపల్లి, రాంపూర్, ధర్మారం గ్రామాలకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీరాంపూర్: నస్పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నందున శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎన్పీడీసీఎల్ నస్పూర్ మండల ఏఈ రామచందర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తీగల్‌పహాడ్, నస్పూర్, సీతా రాంపల్లి, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, సీసీసీ అభినవ కాలనీ, పటేల్ కాలనీ, శ్రీపాద సిటీ, రెడ్డి కాలనీ, ప్రగతినగర్ రిటైర్మెంట్ కాలనీ, రాజీవ్‌నగర్ ఏరియాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట, ఊత్కూరు, గంపలపల్లి, మోదెల, ఇటిక్యాల గ్రామాలకు శనివారం ఉదయం 10నుంచి 11.30గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ గణేశ్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఆస్నాదలో 'అప్పుడే మంచిగుండే'



ఫిర్యాదులు చూపిస్తున్న నాయకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో 'అప్పుడే మంచిగుండే' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఆదిల్‌పేట్‌లో..

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామంలో 'అప్పుడే మంచిగుండే' కార్యక్రమంలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేట్టారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వేల్పుల రవి, మాజీ వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవాపూర్‌లో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో శుక్రవారం ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు సత్యపాల్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని మెగా వాలంటరీ బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. 100 మందికి పైగా కార్మికులు, అభిమానులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ కోఆర్డినేటర్ వేముల కృష్ణ, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కనుకుల రాకేశ్, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ చెండె నవీన్, యూనియన్ నాయకులు సతీశ్‌రెడ్డి, రమణారెడ్డి, అన్నం కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పార్వతి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర గీతంపై జననీ తనయ నృత్య వైభవం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4గంటలకు రాష్ట్ర గేయం జయ జయహే తెలంగాణపై జననీ తనయ నృత్య వైభవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కేవీ ప్రతాప్, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ చిదానంద కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గీతంపై 108 మంది తల్లులు, 108మంది కుమార్తెలు, 108మంది నాట్య విద్యార్థులు నృత్యం చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్‌దీపక్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలి

మందమర్రిరూరల్: టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూపు వన్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పాలచెట్టు ఏరియాలోగల ఐటీఐ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టీజీపీఎస్సీ గ్రూపు వన్ పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని, బోర్డులోని సభ్యులను వెంటనే తొలగించాలని కోరారు. మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు యశ్‌కుమార్, రాజు, విష్ణు, శివ తదితరులున్నారు.

వంతెన నిర్మించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరుమందమర్రిని ఆనుకుని ప్రవహించే రాళ్లవాగుపై సింగరేణి సేఫ్ నిధులతో వంతెన నిర్మించి వాగు అవతలి గ్రామాల ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరుతూ శుక్రవారం టీడీపీ నాయకులు ఏరియా జీఎం రాధాకృష్ణను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్, నాయకులు జూపాక సంధ్య, రాజేశ్, రంగనాథ్, గోపాల్ తదితరులున్నారు.

పార్టీ ప్రారంభోత్సవానికి రావాలి

పాతమంచిర్యాల: ఈ నెల 17న హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో తలపెట్టిన బీసీల పార్టీ ప్రారంభోత్సవానికి జిల్లా నుంచి బీసీలు స్వచ్ఛందంగా రావాలని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మహేశ్‌వర్మ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సంఘం నాయకులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటుతామని చెప్పారు. నాయకులు దాస్యపు దీపక్‌కుమార్, పడాల శివతేజ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లికి చెందిన చొప్పరి రాజయ్య–లక్ష్మి దంపతుల కూతురు అక్షిత ఇటీవల కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడగా బాధిత కుటుంబానికి శుక్రవారం కాసిపేట–1 గని సర్వే డిపార్ట్‌మెంట్ వారి చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, సంస్థ అధ్యక్షుడు ఆడెపు రవీందర్, సభ్యులు రవికుమార్, మేకల ఆంజనేయులు, దాగం ఆనంద్, బండి గణేశ్, బిజ్జూరి కిషన్ ఉన్నారు.

సాంఘికశాస్త్రం బోధనపై సమావేశం



భీమారంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదు పాఠశాలల్లో సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు శుక్రవారం బోధనపై సమావేశం నిర్వహించారు. మండల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శ్రీనివాస్, మంచిర్యాల, నస్పూర్, భీమారం, జైపూర్, హాజీపూర్ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

చెన్నూర్‌రూరల్: 2015–16 విద్యాసంవత్సరానికి గాను మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు రూపొందించిన దోస్త్ చివరి అవకాశంగా స్పాట్ అడ్మిషన్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేసిందని ప్రిన్సిపాల్ ఎంపీ పట్వర్ధన్ ఓ ప్రకటనలో తెలిపారు. దోస్త్ వెబ్‌సైట్‌లో ఖాళీల వివరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో విద్యార్థులు దరఖాస్తు చేసుకుని 17న కళాశాలలో నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీ, కులం, ఆదాయం, పదో తరగతి, ఇంటర్ మెమోలు తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రోగులకు వైద్య సేవలందించాలి

లక్సెట్టిపేట: వైద్య సిబ్బంది రోగులకు మంచి సేవలందించాలని జిల్లా వైద్యాధికారి అనిత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోగుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఓపీ గదులు, రిజిష్టర్లు, రికార్డులు, ఫార్మసీ గదులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ పద్మ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాళ్లపేట పీహెచ్‌సీ తనిఖీ

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో అనిత తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. ఓపీ, మందుల నిల్వల గురించి డాక్టర్ క్రాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు.

ఉద్యోగాలు సాధించినవారికి సన్మానం



సన్మాన గ్రహీతలతో సబ్ కలెక్టర్ మనోజ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ ఏరియా బీసీ బాలుర వసతి గృహంలో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురిని శుక్రవారం సన్మానించారు. సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయుడు విలాస్, సన్మాన గ్రహీతలు సీహెచ్ రాజన్న, జీ ప్రదీప్, జీ వెంకటస్వామి, డీ శ్రీకాంత్, సీహెచ్ శ్రీనివాస్, డీ సుగుణాకర్, వికాస్, సాయికృష్ణ, బీసీ వసతిగృహ సంక్షేమాధికారి జీ వెంకటేశం, వసతిగృహ సంక్షేమాధికారి సరిత, శ్రీనివాస్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్వామి, గ్రామస్తులు

బెల్లంపల్లి: కన్నాల గ్రామపంచాయతీని బెల్లంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 80శాతం మంది ప్రజలు ఉపాధిహామీపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో గ్రామాన్ని విలీనం చేస్తే వారు ఉపాధి కోల్పోయే ప్రమాదముందని పేర్కొన్నారు. కన్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ మున్సిపాలిటీలో విలీనం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో కన్నాల మాజీ సర్పంచ్ మంద అనిత, నాయకులు భరత్, గోగర్ల రాజేశం, చంద్రమౌళి, నర్సయ్య, మల్లేశ్, కిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వందశాతం బిల్లులు వసూలు కావాలి



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వందశాతం విద్యుత్ బిల్లులు వసూలు కావాలని, సంస్థ మనుగడకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) తిరుపతిరెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరుకుపోయిన విద్యుత్ బకాయిల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఉద్యోగుల సంక్షేమం, సంస్థ ప్రగతికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ను ఎస్‌ఈ ఉత్తమ్ జాడే, ఎస్ఏవో రాజేశం, డీఈ రాజన్న, యూనియన్ నాయకులు సన్మానించారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు



నెన్నెలలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

నెన్నెల: మండలంలో శునకాల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏ గ్రామంలో చూసినా కుక్కలు గుంపులుగుంపులుగా సంచరిస్తూ జనాలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. చిన్నపిల్లలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులను వెంబడిస్తూ పరుగులు పెట్టిస్తున్నాయి. ఇప్పటికే పలువురిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలున్నాయి. చికెన్ సెంటర్ల వద్ద గుంపులుగుంపులుగా ఉంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామసింహాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో తహసీల్దార్, హెచ్‌ఎం

జన్నారం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో జన్నారం, దండేపల్లి మండలాల టీడబ్ల్యూ పీఎస్‌ల ప్రధానోపాధ్యాయులు, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఆశ్రమోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాజం, మంచిర్యాల ఏసీఎంవో లక్ష్మయ్య, రఘునాథం తదితరులున్నారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న ఉద్యోగులు

చెన్నూర్: చెన్నూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు సూపరింటెండెంట్ సత్యనారాయణకు శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఐదు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వేతనాల కోసం ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు మహేశ్, విజయ్, స్వరూప, కౌసల్య, సౌందర్య, శ్రీనివాస్ ఉన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

జన్నారం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యులు సమయపాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అనిత సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కలమడుగు ఉప కేంద్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ సభ్యుడు గూగుల్ మీట్ ద్వారా జాతీయ ప్రామాణికత కోసం చూశారని తెలిపారు. వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ నెల 17నుంచి అక్టోబర్ 3వరకు స్వశక్తి నారీ కేంద్ర ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్ ఆర్‌ఎస్ పద్మ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డీపీవో ప్రశాంతి, వైద్యులు ఉమాశ్రీ, గంగదేవి తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: నాణ్యమైన విద్యతోపాటు బాలికలకు భద్రత, భరోసా కల్పిస్తూ కేజీబీవీలను నిర్వహించాలని డీఈవో యాదయ్య సూచించారు. శుక్రవారం డీసీఈబీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సమగ్రశిక్ష కో–ఆర్డినేటర్లు విజయలక్ష్మి, చౌదరి, సత్యనారాయణమూర్తి, ఏఎస్‌సీ రాజ్‌కుమార్, కేజీబీవీ, యూఆర్‌ఎస్ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మొబైల్ ల్యాబ్‌తో ప్రయోజనం

జైపూర్: మొబైల్ ల్యాబ్‌తో విద్యార్థులకు అనేక ప్రయోజనాలున్నాయని ముదిగుంట హైస్కూల్ హెచ్‌ఎం, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్ తెలిపారు. మండలంలోని ముదిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేవా భారతి తెలంగాణ జిజ్ఞాస ప్రయోగశాల మంచిర్యాల ఆధ్వర్యంలో విద్యార్థులకు నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలు, మానవుని జీర్ణ వ్యవస్థ, హృదయ స్పందన, మూత్రపిండాల పనితీరు, మెదడు తదితర ముఖ్యమైన భాగాల పనితీరుపై ప్రత్యేక చిత్రపటాల ద్వారా జిల్లా సూచకులు లక్ష్మణ్, సహాయకులు సంపత్ వివరించారు. ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, పవన్, నాగలక్ష్మి, సీఆర్పీ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

జైపూర్: గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి డీ వెంకటేశ్వర్‌రావు సిబ్బందికి సూచించారు. మండలంలోని ఇందారం, షెట్‌పల్లి, బెజ్జాల గ్రామ పంచాయతీలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. బెజ్జాల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టికను పరిశీలించి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శులు సుమన్, ప్రతిభారాణి, రమాదేవి ఉన్నారు.